క్లుప్తంగా

7 ఎంపీటీసీ స్థానాలతో జాబితా విడుదల

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మొత్తం 19 గ్రామ పంచాయతీలకు గాను 7 ఎంపీటీసీ స్థానాలతో అధికారులు తుది జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మీడియాకు వివరాలు వెల్లడించారు. భాంజీపేట, చంద్రయ్యపల్లి, కమ్మపల్లి, ఇటుకాలపల్లి, లక్నెపల్లి, రాజుపేట, గురిజాల ఎంపీటీసీ స్థానాలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఇద్దరు విలేకరులపై కేసు

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన దుంపల వేణు పొక్లెయిన్‌తో రైతుల పొలాల్లో బండ రాళ్లను తొలగిస్తూ, ఇతర పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో మట్టి దందా చేస్తున్నావంటూ వెలుగు పత్రిక విలేకరిగా పని చేస్తున్న మండల కేంద్రానికి చెందిన దొడ్డ శ్రీనివాస్, నవతెలంగాణ విలేకరిగా పని చేస్తున్న చింతనెక్కొండకు చెందిన బోనాల సాంబయ్య బెదిరింపులకు పాల్పడ్డారు. శ్రీనివాస్, సాంబయ్య వేధింపులు తాళలేక వేణు పలుమార్లు కొంత డబ్బు ముట్టజెప్పాడు. అయినా శ్రీనివాస్, సాంబయ్య ఇంకా డబ్బు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నట్లు బాధితుడు వేణు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఐపీసీ, రాక్ చీఫ్ ఇంజనీర్‌గా వెంకటరమణ

హన్మకొండ: ఐపీసీ, రాక్ చీఫ్ ఇంజనీర్‌గా టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో కె.వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కె.వెంకటరమణకు చీఫ్ ఇంజనీర్‌గా యాజమాన్యం పదోన్నతి కల్పించి ఐపీసీ రాక్ విభాగ సీఈగా నియమించగా, ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే, ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని ఆపరేషన్ విభాగంలో డీఈగా పనిచేస్తున్న శ్రీకాంత్‌కు సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ డీపీఈ ఎస్ఈగా నియమించగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

ఓఎస్‌డీగా బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా మ్యాథమెటిక్స్ విభాగం ప్రొఫెసర్ మల్లారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత నియామక ఉత్తర్వులను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం నుంచి అందుకున్నారు. ఏడాది పాటు ఓఎస్‌డీగా మల్లారెడ్డి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

సభ్యుల సంక్షేమానికే ప్రాధాన్యం



ఖిలా వరంగల్: సంఘం బలోపేతంతోపాటు సభ్యుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు శ్రీతారక రామ పరపతి సంఘం అధ్యక్షుడు బత్తిని లింగయ్య గౌడ్ అన్నారు. వరంగల్ లక్ష్మీనగర్‌లోని శ్రీతారక రామ పరపతి సంఘం భవనంలో ప్రధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన సంఘ 40వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చింత పట్ల మురళి, దద్దనాల రాజేష్, టీకుమట్ల కుమారస్వామి, ఎనబోతుల రవికుమార్, మహారాజు భరత్, నెల్ల రాజు, కమట వేణుగోపాల్, రాజ్‌కుమార్, కోల రాజ్‌కుమార్, అయిలయ్య, వనమాల ప్రహ్లాద్, శివరాజు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ పార్కింగ్ స్థలంలో వాహనం నిలపరాదు

ఖిలా వరంగల్: నాన్ పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు వాహనాలను సీజ్ చేస్తామని వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఆర్ కృష్ణ అన్నారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో పరిధిలోని నాన్ పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపి ఉంచిన వాహనచోదకులకు ఎస్ఐపీఎఫ్ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని పార్కింగ్ స్థలంలోనే పార్క్ చేయాలని సూచించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల బైండోవర్

గీసుకొండ : వాట్సప్ గ్రూపుల్లో పరస్పర ఆరోపణలు చేసుకుంటూ వివాదాస్పద పోస్టులు పెట్టిన క్రమంలో సంబంధిత కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు తహసీల్దార్ ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్టు సీఐ మహేందర్ తెలిపారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు ఇటీవల పరస్పరం వివాదాస్పదమైన పోస్టులు పెట్టారని సీఐ చెప్పారు. సదరు పోస్టులు వైరల్ కావడంతో శాంతిభద్రతల దృష్ట్యా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పునాదికే పరిమితం



అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ సెంటర్



బేస్మెట్ లెవల్‌లోనే నిలిచిన సబ్ సెంటర్ నిర్మాణం

- రెండేళ్లు గడుస్తున్నా ప్రారంభం కాని నిర్మాణ పనులు
- అద్దె భవనంలో సబ్ సెంటర్
- రోగులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు : ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్ వద్ద ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సబ్ సెంటర్ నిర్మాణానికి రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారు. ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని కూల్చివేసి అదే స్థలంలో సబ్ సెంటర్ నిర్మాణానికి పునాది తీశారు. అయితే బేస్‌మెంట్ లెవల్‌లోనే ఈ నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ఓ వైపు పాఠశాల భవనాన్ని కూల్చివేయడం, సబ్ సెంటర్ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేయడంతో స్థానికుల నుంచి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బేస్‌మెట్ లెవెల్ వరకు పనులు పూర్తి చేసి రెండేళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జనవాసాలకు దూరంగా ఉండడంతో గ్రామ పంచాయతీ ఎదురుగా అద్దె ఇంట్లో సబ్ సెంటర్ ఏర్పాటు చేశారు. కానీ అది ఇరుకైన భవనం కావడంతో వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సబ్ సెంటర్‌కు చిన్నారులకు వాక్సినేషన్ ఇప్పటించేందుకు, వివిధ ఆరోగ్య కారణాలతో గర్భిణులు, బాలింతలు తరచుగా వస్తుంటారు. సబ్ సెంటర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అన్ని వసతులు కల్పించాలని మొరపెట్టుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా సబ్ సెంటర్ భవన నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై మండల వైద్యాధికారి స్పందనను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, భవన నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.

భ్రమరాంభిక ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



చండీ హోవనంలో పాల్గొన్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు : మల్లికార్జున స్వామి ఆలయానికి ఉత్తర భాగంలో నిర్మించిన భ్రమరాంభిక ఆలయ ఏకాదశ (11వ) వార్షికోత్సవ వేడుకలు సోమవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకుని ఉదయం విగ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో విశేష అభిషేకం, నవకలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పం, చండీహవన కార్యక్రమాలను అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు భాను ప్రసాద్ శర్మ, నరేష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ.. మాఘమాసం పంచమి(వసంత పంచమి) కావడంతో అమ్మవారిని విశేషంగా అర్చించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మునిగాల సంపత్‌కుమార్, ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



కమలాపూర్ : జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేస్తున్న బీసీ కాలనీవాసులు, పద్మశాలీలు



కాజీపేట అర్బన్ : కల్పనను సన్మానిస్తున్న కలెక్టర్

కమలాపూర్ : పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన భూముల్లో తాము ఇళ్లు నిర్మించుకుంటుంటే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మండల కేంద్రంలోని బీసీ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు సోమవారం ఫిర్యాదు చేశారు. కమలాపూర్‌లోని 895 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో 1987లో 122 మంది పద్మశాలీలకు రెండు గుంటల చొప్పున అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇచిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందులో తాము ఇళ్లు నిర్మించుకుంటుంటే ఎస్సీ వర్గానికి చెందిన కొందరు ఆ భూములు వారివంటూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. వెంటనే విచారణ చేపట్టి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు కబ్జాకు గురైన భూములను బాధిత కుటుంబాలకు అందించి న్యాయం చేయాలని కోరారు. కాగా వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రాజగోపాల్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కృష్ణప్రసాద్, మీడియా కో ఆర్డినేటర్ రాజేందర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, వేణుగోపాల్, రవీందర్, బాధిత బీసీ కాలనీవాసులు పాల్గొన్నారు.

దాసరి కల్పనకు కలెక్టర్ సన్మానం

కాజీపేట అర్బన్: శాయంపేట మండలం స్వయం సహాయక సంఘ సభ్యురాలు దాసరి కల్పనను కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య సోమవారం సన్మానించారు. ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ గణతంత్ర దినోత్సవంలో రాష్ట్రవ్యాప్తంగా 12 మంది లక్‌పతి దీదీలు పాల్గొనగా అందులో కల్పనకు అవకాశం లభించింది. రూ.20 లక్షల వ్యయంతో నాన్ ఓవెన్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ఆమె శాయంపేటలో ప్రారంభించి ఆర్థికంగా రాణిస్తున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఎం.శ్రీను, అడిషనల్ డీఆర్‌డీఓ సుధీర్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్య తీసుకోవాలి

పరకాల : నోటిఫికేషన్ ఇచ్చిన మరుసటి రోజే దరఖాస్తులు స్వీకరించకుండా మెసెంజర్ పోస్టును భర్తీ చేసిన పరకాల మండల విద్యాశాఖాధికారి రమాదేవిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్ సెల్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందించారు. నిబంధనల ప్రకారం భర్తీ చేయాల్సిన అవుట్‌సోర్సింగ్ పోస్టులను అధికారులు వారికి నచ్చిన వారికి కేటాయించడం అన్యాయమని అన్నారు. తక్షణమే ఆయా పోస్టుల భర్తీపై విచారణ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, ఎస్ఎఫ్ఐ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు సాల్మాన్‌రాజ్ పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి, ఎమ్మెల్సీ సారయ్య

దామెర : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. సోమవారం మండలంలోని పులుకుర్తిలో శ్రీబాలమానసా విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్మించే నూతన ఆలయానికి వేదపండితులతో కలసి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాజశ్యామల యాగంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూడెకరాల విస్తీర్ణంలో శ్రీ బాల మానసాదేవితో పాటు 32 మహా గణపతుల విగ్రహాలు, నవ గ్రహాలకు నవ ఆలయాలు, సహస్ర లింగ ఆలయాన్ని నిర్మించడం శుభపరిణామమన్నారు. ఈ ఆలయ నిర్మాణంతో ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు లక్ష్మీనారాయణ, గురుభవాని, సాంబయ్య, క్రైదాయ్, తిరుపతి, సమ్మారావు, శ్రీనివాస్, యుగేందర్, అరుణ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన, విహార యాత్ర



కమలాపూర్ : ప్రముఖ పారిశ్రామిక వేత్త స్వర్గం రవి మనుమరాలు స్వర్గం రియా (అమెరికా) సహకారంతో మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం విజ్ఞాన, విహార యాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కోటగుళ్లు, రామప్ప, లక్నవరం, వరంగల్‌లోని వివిధ చారిత్రక ప్రదేశాలను సందర్శించి ఆయా ఆలయాల ప్రాముఖ్యత, విశిష్టతను తెలుసుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్‌ఇన్‌వన్‌ల పంపిణీ



ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 43 మంది విద్యార్థులకు సోమవారం దాతలు రాజారపు రమేశ్, పెంధల అశోక్ వసంత పంచమిని పురస్కరించుకుని రూ.10వేల విలువచేసే ఆల్‌ఇన్‌వన్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పొన్నాల రాజు, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ గోనె రాజు, గిరిక రాజు, ఆడెపు విక్రమ్, హెచ్‌ఎం రాజానంద్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ధర్మసాగర్ : మండలంలోని రైతులకు జాతీయ ఆహార భద్రతమిషన్ ద్వారా పాస్ఫరస్, సాల్యుబుల్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) అందుబాటులో ఉన్నాయని ఏఓ రాజేశ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న, పప్పుధాన్యాల సాగులో బాస్వరాన్ని కరిగించే ఎరువులు రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన పే ర్కొన్నారు.

ఆర్థికసాయం



దామెర : మండలంలోని పసరగొండకు చెందిన గజ్జి పాల్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా అతడు చదువుతున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 21వేల ఆర్థిసాయం, 50కేజీల బియ్యం అందజేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

శాయంపేట : కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన బొమ్మినేని రంజిత్(40) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన బొమ్మనేని రంజిత్ వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. రంజిత్ నాలుగు నెలలుగా వ్యవసాయ పనులకు వెళ్లకుండా నిత్యం మద్యం సేవించి ఇంటి వద్ద ఉంటున్నాడు. దీంతో భార్య మౌనిక ఎదిగిన పిల్లలు ఉన్నారని, పనికి వెళ్లకుంటే ఎలా అని రంజిత్‌ను మందలించింది. దీంతో మనస్థాపంతో గత నెల 23వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కలవారు 108లో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి కుమారుడు చరణ్‌తేజ్, కూతరు ఇందుశ్రీ ఉన్నారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో రోడ్డు బురదమయం



లీకేజీతో బురదమయమైన రోడ్డు

శాయంపేట : మండలంలోని మైలారం నుంచి జోగంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టు పక్కన రైతులు జోగంపల్లి గ్రామ శివారులోని చలివాగు ప్రాజెక్టు నుంచి సైఫాన్ పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు నీరు అందిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు మధ్యలో వేసిన సైఫాన్ పైపులు పగిలి నీరు లీకేజీ అవుతోంది. దీంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో బురదగా మారి ప్రమాదకరంగా ఉందని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయాల్లో వసంత పంచమి పూజలు



ఎల్కతుర్తి : ముల్కనూరు గ్రంథాలయంలో అక్షరాభ్యాసం చేపిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు



పరకాల : బిట్స్‌లో వసంత పంచమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో మాఘమాసం వసంత పంచమిని పురస్కరించుకొని సోమవారం భక్తులు శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేశారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రజా గ్రంథాలయం ఆవరణలో సరస్వతి దేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు పలక, బలపంతో పాటు పెన్నులు, బుక్కులు అందించి అక్షరాభ్యాసం చేపించారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్, మాజీ సర్పంచ్ కొమురయ్య, లక్ష్మయ్య, సరోజన, తిరుపతి, వీరేశం ,ప్రమోద్‌రెడ్డి, అశోక్‌ముఖర్జీ, రాజు, భగత్‌సింగ్, శంకర్ భక్తులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్, బిట్స్ పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. అర్చకుల మంత్రోచ్చరణల నడుమ జరిగిన వేడుకలకు పూర్వవిద్యార్థులతోపాటు చిన్నారులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 30 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేపించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాలకు వాటర్ ఫ్రిజ్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్, సమితి అధ్యక్షుడు డాక్టర్ నాగబండి విద్యాసాగర్, జిల్లా కార్యదర్శి పూజారి రాజయ్య, పాఠశాల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు గురుప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



ధర్మసాగర్ : ట్రోఫీ అందజేస్తున్న ఎస్సై నర్సింగరావు



పరకాల : మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

ధర్మసాగర్ : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై నర్సింగరావు అన్నారు. సోమవారం ధర్మసాగర్ గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలకు, ట్రోఫీతో పాటు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో గెలిచిన వారికి ఆనందం, ఓడినవారికి అనుభవం దక్కుతుందని అన్నారు. క్రీడలతో మానసికోల్లాసం , శారీరక దృఢత్వంతో పాటు స్నేహాభావం పెంపొందుతుందన్నారు. రానున్న రోజుల్లో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ లెనిన్, నాయకులు మహమ్మద్ యాసిన్, ఈమన్, వేణు, ఇస్మాయిల్, అనిల్, కబడ్డి అసోసియేషన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ముజ్జు, చందుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరకాల : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరై మట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయికి గ్రామీణ క్రీడాకారులు ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలతో స్నేహాభావం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నామాని సాంబయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మహ్మద్ గౌస్, మధు, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ కవిత, పీఈటీ శ్యామ్ తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రంపై కేంద్రం చిన్నచూపు



ఐనవోలు : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



దామెర : అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐనవోలు : ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒక్క రూపాయి ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూసిందని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయ పడుతుంటే కేంద్రం మాత్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి భారతీయ జనతా పార్టీకి 8 మంది ఎంపీలు ఉన్నారని, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులైనప్పటికీ రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి రాష్ట్రానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, అనుబంధ సంఘాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ధర్నా

దామెర : మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించలేదని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్



డిక్షనరీలు అందజేస్తున్న జగదీశ్వర్, అర్చన

కమలాపూర్ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు సోమవారం సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అత్యంత ప్రతిభ కనబర్చిన శ్రీజ, వర్షితకు డిక్షనరీలు, జ్ఞాపికలు, పూజ, అక్షయ, వైశాలికి కన్సోలేషన్ బహుమతులుగా హ్యాండ్ డిక్షనరీలు, జ్ఞాపికలను కేజీబీవీ ఎస్ఓ అర్చన, ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) చేతులమీదుగా అందించారు. వసంత పంచమిని పురస్కరించుకుని కేజీబీవీలోని 325 మంది విద్యార్థినులకు పెన్నులు అందించారు. సాయిలత, మహేశ్వరి, భాగ్యలక్ష్మి, రజని, శ్రావణి, ధనలక్ష్మి, పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూరు : ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన వేల గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పెండేల భిక్షపతి పిలుపునిచ్చారు. మండలంలోని హౌజీబుజుర్గులో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేయాలనే డిమాండ్‌తో నిర్వహించే నిరసనకు ప్రతి మాదిగ బిడ్డ తరలిరావాలన్నారు.